

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం,21 జులై 2025

8 పేజీలు


## పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో...

# ప్రైవేటు వ్యక్తులే స్టార్లు



పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ బినామీ నల్లటి రమణ

- రిజిస్ట్రేషన్ కార్యాలయంలో బినామీల హవా
- తెర వెనుక చక్రం తిప్పుతున్న వసూల్‌రాజాలు
- వసూళ్ళలో జిల్లా రిజిస్ట్రార్‌కి వాటాలు...! - యధేచ్ఛగా సాగుతున్న అక్రమాలు
- గతంలో ఎసిబికి పట్టుబడిన జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావు - ఇక్కడా ఎసిబి నిఘా



సూర్య

పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్‌లో బ్రోకర్లు - డాక్యుమెంట్ రైటర్ల

దందా





మార్చి నెలలో రూ.లక్ష లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఎసిబికి చిక్కిన కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావు

ఉభయ గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

పెద్దాపురం రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల దందా యధేచ్ఛగా సాగుతోంది. పెద్దాపురం రిజిస్ట్రార్ అధికారిణికి నల్లటి రమణ వసూల్‌రాజాగా మెదులుతూ మరో ఇద్దరు బ్రోకర్లు కూడా వసూల్‌రాజాలుగా ప్రభుత్వ కార్యాలయంలో హవా నడిపిస్తున్నారు. వీరు కూడా పెద్దయెత్తున వెనుకేసు కుంటున్నారనే ప్రచారం ఉంది. ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉద్యోగులకంటే ఎక్కువగా ప్రైవేట్ వ్యక్తులు, డాక్యుమెంట్ రైటర్లు హవా నడుస్తోందని తీవ్ర విమర్శలు ఉన్నాయి. డాక్యుమెంట్లు చేయడంతోపాటు ఆఫీసులో సైతం వారే పెత్తనం చెలాయిస్తున్నారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చేవారి నుంచి ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రజల నిరక్షరాస్యతతోపాటు విద్యావంతులు సైతం ఆన్‌లైన్‌లో సర్వే నెంబర్ల పరిశీలన డాక్యుమెంట్ కోసం చేయాల్సిన పనులు స్లాట్ బుకింగ్ తెలిసినప్పటికీ డాక్యుమెంట్ రైటర్లను సంప్రదించడంతో వారి ఆదాయం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుందని చెప్పొచ్చు. కాకినాడ జిల్లా పెద్దాపురం రిజిస్ట్రేషన్ కార్యాలయం బినామీలు, దళారులకు అడ్డాగా మారింది. దళారులు లేనిదే ఒక్క రిజిస్ట్రేషన్ కాదు. స్లాట్ బుకింగ్, ప్లాట్లు, ఇల్లు, వ్యవసాయ భూములు, వివాహాల రిజిస్ట్రేషన్ జరగాలంటే బ్రోకర్ల ద్వారా పోతేనే పని అయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవేళ బ్రోకర్లను కాదని సబ్ రిజిస్ట్రార్ వద్దకి నేరుగా వెళితే పనయ్యే పరిస్థితులు లేవు. ప్రభుత్వ, ప్రైవేటు భూములను అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్లు జరిగేలా చూస్తూ నిత్యం లక్షలు సంపాదించుకుంటున్నారు. పెద్దాపురం కార్యాలయంలో వసూళ్ళపై ఇప్పటికే అవినీతి నిరోధకశాఖకు పలు ఫిర్యాదులు అందాయి. అవినీతిని ఆధారాలతో సహా పట్టుకోవడం ఖాయంగా సమాచారం వుంది. పెద్దాపురం రిజిస్ట్రార్...ప్రైవేటు వ్యక్తి నల్లటి రమణ, మరో ఇద్దరు బినామీల అక్రమ వసూళ్ళపై ఉభయ గోదావరి జిల్లాల సూర్య బ్యూరో అందించిన క్షేత్రస్థాయిలోని పరిశీలనాత్మక కథనం..

నల్లటి రమణే కాదు, మరో ఇద్దరు ఇదే రకంగా పనిచేస్తున్నారు. రిజిస్ట్రార్ కార్యాలయంలోకి బయట వ్యక్తులకు అనుమతి లేదు. కేవలం రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికే ప్రవేశం కొంతవరకు ఉంటుంది. రికార్డు రూము, కంప్యూటర్ క్యాబిన్ ఇలాంటివాటిలోకి రక్షణ గోప్యత కోసం ప్రైవేటు వ్యక్తులకు అనుమతి లేదు.ప్రైవేటు వ్యక్తుల పెత్తనం ఉండకూడదని సిసి కెమెరాలతో నిఘా కూడా పెట్టారు. కానీ ఇక్కడ అవేమీ పట్టించుకోలేదు. ఎందుకంటే ఈ అవినీతి లంచాల వసూళ్ళలో జిల్లా రిజిస్ట్రార్ అధికారిణికీ కూడా నెలనెలా వాటాలు ఇస్తున్నామని... చాలా ప్రొటోకాల్ ఉంటుందని..వారికి డబ్బులు

- తరువాయి 2లో..

## వచ్చే నెలలో తిరుపతిలో

# టూరిజం కాన్‌క్లేవ్ నిర్వహణ

**– రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో త్వరలోనే రాష్ట్రంలో ఈవెంట్ మేనేజ్మెంట్ సరికొత్త కార్యకార్యరూపంలోకి వస్తుందని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఆదివారం కాకినాడ విద్యుత్ నగర్‌లోని ఏ కన్వెన్షన్ నందు ఏర్పాటు చేసిన కాకినాడ ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో, ఈమా లైమ్‌లైట్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ప్రతిభావంతులైన యాంకర్లు, సింగర్లు, డాన్సర్స్, సౌండ్, లైటింగ్, ఎల్‌ఈడి టెక్నీషియన్లు తదితర నటులు, కళాకారులకు మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా తన చేతుల మీదుగా అవార్డులు ప్రధానం చేశారు. ఈవెంట్ పరిశ్రమలో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి, సత్కరించడానికి ఉద్దేశించిన ఈమా లైమ్‌లైట్ అవార్డులను అందించడం సంతోషంగా ఉందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధిలో భాగంగా ప్రకృతి సౌందర్యంతో పాటు ఎక్కువ సంఖ్యలో హెూటల్స్, రిసార్ట్స్, గదులు, ఈవెంట్ మేనేజ్మెంట్‌ల ఏర్పాటు అవసరాన్ని వివరించారు.పిపిపి విధానంలో చేపడుతున్న పర్యాటక అభివృద్ధిలో భాగంగా సరికొత్త ఆలోచనలతో,సృజనాత్మకతతో కూడిన కార్యక్రమాలు చేపట్టాలని ఈసందర్భంగా

- తరువాయి 2లో..

## కూటమి సంవత్సరపాలనలో

# అన్ని రంగాలను అభివృద్ధి చేస్తున్నాం

**-రామవరం సుపరిపాలన తొలి అడుగులో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**



**జగ్గంపేట, మేజర్‌న్యూస్ :** కూటమిపాలనలో అన్ని రంగాల్లోనూ రాష్ట్రంపురోభివృద్ధి సాధిస్తుం దని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వ్యాఖ్యానించారు.ఆదివారంజగ్గంపేట మండలం రామవరం గ్రామంలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అమలు పరిచిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో విధ్వంసం పాలైన రాష్ట్రాన్ని గాడిన పెట్టి వికాసం దిశగా పయనింపచేస్తున్నామ న్నారు. పింఛన్ల పెంపు మొదలుకుని తల్లికి వందనం, మెగా డీఎస్సీ,ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ఇలా ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చామని త్వరలోనే అన్నదాత సుఖీభవ,మహిళలకు ఉచిత బస్సు అమలుచేయనున్నామని తెలిపారు.సంక్షేమంతో పాటు అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఈకార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, ఉప్పలపాటి బుల్లబులు, పాఠంశెట్టి రవి,బోదిరెడ్ల సుబ్బారావు, కుంచే తాతాజీ, మండపాక అప్పన్నదొర,మండపాక వెంకటేశ్వరరావు, అడబాల సూరిబాబు,

- తరువాయి 2లో..

# పెద్దాపురం సబ్ రిజిస్టర్ ఆఫీసులో... ప్రైవేటు వ్యక్తులే స్టార్లు

మొదటిపేజి తరువాయి

ఇవ్వడం కోసమే రిజిస్ట్రేషన్‌కి ఇంత వసూళ్ళు చేస్తున్నామని కక్షిదారులకు నల్లటి రమణ అనే బ్రోకర్ చెప్పడం కొసమెరుపు. కార్యాలయంలో నల్లటి రమణ, సిండికేట్ డాక్యుమెంట్ రైటర్ల హవాయే ఎక్కువగా ఉంది. దళారులను సంప్రదిస్తేనే రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు వేగవంతంగా జరుగుతాయి. లేదంటే కొర్రీలతో ఇబ్బందులు తప్పవు. ఇదంతా పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ అధికారిణి ప్రోత్సాహంతోనే జరుగుతోందని చెబుతున్నారు. వారి పేరు చెప్పుకుని ప్రతి డాక్యుమెంట్‌కు రూ.వేలల్లో, కొన్ని డాక్యుమెంట్లకు పారీఖత్తులు, వాటాల జాబితాల రిజిస్ట్రేషన్లకు లక్షల్లో లంచాలు తీసుకుంటున్నారట. అధికారులకు ఇవ్వాలని చెబుతూ భూములు, ఇతర ఆస్తుల క్రయవిక్రయాలు చేసుకునేవారి వద్దనుంచి వసూళ్ళు సాగిస్తున్నారు. సిసి కెమెరాల నిఘా ఉన్నప్పటికీ, నల్లటి రమణ కార్యాలయంలో యధేచ్ఛగా తిరుగుతూ వసూళ్ళ సొమ్ములు అతని వద్దే ఉంచుకుంటూ... కార్యాలయ వేళలు ముగిసాక వసూలు చేసిన సొమ్మును రిజిస్ట్రార్‌కి ముట్టజెబుతున్నట్లు తెలుస్తోంది. ఇదంతా బహిరంగ రహస్యమే...


పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ బినామీ నల్లటి రమణ

**అవినీతి, అక్రమాలపై ఫిర్యాదు..** మధ్యవర్తుల ప్రమేయం, సిండికేట్ డాక్యుమెంట్ రైటర్ల హవా ఎక్కువవడంతో వారికి ఇష్టం లేని వ్యక్తుల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు చేయడంలో తాత్సారం జరుగుతున్నందన కొందరు బయటికొస్తున్నారు. వారు చెప్పినట్లు నడుచుకోవడం లేదని, తమ డాక్యుమెంట్లకు రకరకాల కొర్రీలు పెట్టి రిజిస్ట్రేషన్లు చేయకుండా పక్కన పెడుతున్నారని వాపోతున్నారు. అటువంటివారు ఫిర్యాదులు చేస్తున్న ఉన్నతాధికారుల సైతం పట్టించు కోవడంలేదని అంటున్నారు.

**ఎసిబి నిఘా...!**పెద్దాపురం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నల్లటి రమణ ఎవరూ...ఎంతమంది కార్యాలయ సిబ్బందిఉన్నారు? సిండికేట్ డాక్యుమెంట్ రైటర్ల ఆస్తులు ఎన్ని కోట్లు...ఏమేర ఎలా సంపాదించారు? రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఎవరెవరు అవినీతికి పాల్పడుతున్నారు? ఎంత వసూలు చేస్తున్నారు? ఎవరి పాత్ర ఎంత? తదితర వివరాలపై నిఘా పెట్టి విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ సంవత్సరం మార్చిలో రూ.లక్ష లంచంగ డిమాండ్ చేసి... ఆ లంచం అవినీతి డబ్బు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గాఎసిబికి దొరికిపోయిన జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావు ఆస్తులురూ. కోట్లలో బయటప ́డ్డాయి. ఇలాగే పెద్దాపురంలో కూడా కోట్ల ఆస్తులు బయటపడే అవకాశం వుందని , వీరి వసూళ్లు అన్నిఇన్నీ కావని చెబుతున్నారు.

**యధేచ్ఛగా వసూళ్ళ దందా...**పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంవద్ద ఎన్నో ఏళ్ళుగా తిష్ట వేసిన సిండికేట్ డాక్యుమెంట్ రైటర్లు రిజిస్ట్రేషన్లలో చక్రం తిప్పుతున్నారు. వారికి ఎలాంటి లైసెన్స్‌లు లేవు. ఎలాంటి నియంత్రణ లేదు. డాక్యుమెంట్ రైటర్లు తయారుచేసి ఇచ్చిన డాక్యుమెంట్లనే సబ్ రిజిస్ట్రార్ అధికారిని అంగీకరిస్తున్నారు. రైటర్లు తయారుచేసే ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.5000 వారు తీసుకుని రూ.10000 వేల నుంచి పరిస్థితులపై ఎంతైనా అందినకాడికి దోచేస్తున్నారు. ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఏవైనా సమస్యలుంటే సబ్ రిజిస్ట్రార్, సీనియర్ గుమస్తా అధికారిణీలకు కాసుల పండగే. ఇలాంటివాటికి రూ.50వేలు నుంచి ఎంత్కెనా వసూలు చేస్తున్నారట. కొన్ని సందర్భాలలో అన్నీ బాగున్నా ఏదో కొర్రి చూపించి సమస్యను సృష్టించి పెండింగ్‌లో పెడుతున్నారట. డబ్బు ముడితేనే కానీ అవి కదలవు. ఈ డబ్బును కూడా నల్లటి రమణ వసూలు చేసి సబ్ రిజిస్ట్రార్‌కి అందిస్తున్నట్లు చెబుతున్నారు.

**స్పందించని జిల్లా రిజిస్ట్రార్..**పెద్దాపురం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులు, సిండికేట్ డాక్యుమెంట్ రైటర్ల అక్రమ వసూళ్ళు... ప్రతీ పనికి ఓ రేటు నిర్ణయించి అడిగినంత డబ్బులు చెల్లించాల్సిందేనని డిమాండ్లు తదితర తీరుపై వస్తున్న ఫిర్యాదులపై వివరణ కోరడానికి సూర్య బృందం నిన్న సాయంత్రం 7093921417 నెంబర్‌కి ఫోన్ చేయగా, జిల్లా రిజిస్ట్రార్ అందుబాటులోకి రాలేదు. ఫోన్‌కి మెసేజ్ పంపినా ఫోన్‌లో మాట్లాడలేదు... వివరణ కోసం అందుబాటులో లేరు.

## శాకాంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన సీతానగరం ఏగులమ్మ అమ్మవారు





**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** సీతానగరం వెలసిన శ్రీ ఏగులమ్మ అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన సీతానగరం గ్రామదేవత ఏగులమ్మ అమ్మ వారు ఆదివారం శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లుతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులను కూడా కూరగాయలతో అలంకరించారు. అనంతరం గ్రామంలో మహిళలందరూ అమ్మవారికి సమర్పించేందుకు ఊరేగింపుగా బయలుదేరి ఏగులమ్మ అమ్మవారికి సారే, చీర, నైవేద్యాలు సమర్పించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.పాల్గొని ఈ కార్యక్రమంలో సీతానగరం ఏ గులమ్మ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# దళితుల శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

**– పి.వి.రావు మాలమహానాడు డిమాండ్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** భారత దేశానికి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు దాటిపోయినా దళితులకు నేటికీ శ్మశాన వాటికకు స్థలం లేక కాలువ గట్లు, చెరువు గట్లు వంటి స్థలాలలో ఖనన సంస్కారాలు చేస్తున్నారంటే పాలకులు సిగ్గుతో తల దించుకోవాలని పి.వి.రావు మలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కొంగు నూకరాజు విమర్శించారు. పిఠాపురం మండలం నవఖండ్రవాడ గ్రామలో... దళిత స్మశాన వాటిక స్థల వివాదంపై వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు పీవీ రావు మాల మహానాడు నాయకులు గ్రామస్తులతో కలిసి పర్యటించారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. కుంతీమాధవ స్వామి దేవస్థానం భూమిని దళితులు ఆక్రమించి శ్మశాన వాటికగా ఉపయోగిస్తున్నారని కొంతమంది హిందూమతానికి చెందిన వారు సామాజిక మధ్యమాల ద్వారా చేస్తున్న ప్రచారం మేరకు వాస్తవ పరిస్థితిని తెలుసుకొనుటకు గాను పిఠాపురం మండలం నవఖండ్రవాడ గ్రామంలో పర్యటించడం జరిగిందన్నారు. అక్కడ వాస్తవ పరిస్థితులను విచారించగా... దళితులు ఉపయోగిస్తున్న స్థలం పిడబ్ల్యుడీ కాలువ గట్టుగా తేలిందని, నవ కండ్రవాడ గ్రామ దళితులకు శ్మశాన వాటికకు స్థలం లేని కారణంగా కాలువ గట్టును ఉపయోగించుకుంటున్నామని, కానీ కొంత మంది మతోన్మాదులు మాపై కుంతీమాధవ స్వామి దేవస్థానం భూమిని ఆక్రమించి శ్మశాన వాటికగా ఉపయోగిస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వి ష య ́ ం ం లో పిఠాపురం మండల తహశీల్దార్ వారిని కలిసి వివరములు అడిగి తెలుసుకోవడం జరుగుతుందని, దళితులు ఉపయోగిస్తున్న భూమి కుంతీమాధవ స్వామి దేవస్థానం భూమి కానప్పటికీ... కొంత మంది మతోన్మాదులు చేస్తున్న అసత్య ప్రచారంపై న్యాయ పరంగా పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి దళితులకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీవీ రావు మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల రాంజీ కుమార్, సహాయ కార్యదర్శి మహేంద్రాడ సింహాచలం, బత్తిన శామ్యూల్, గ్రామ సర్పంచ్ బళ్ళ రజనీ సురేష్ ఇతర దళిత నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే నెలలో తిరుపతిలో టూరిజం కాన్‌క్లేవ్ నిర్వహణ

మొదటిపేజి తరువాయి

అసోసియేషన్లకు సూచించారు. ఈవెంట్ మేనేజ్మెంట్ ద్వారా మరింత మంది పర్యాటకులను ఆకర్షించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టినపీ4 విధానంలో భాగస్వామ్యులు కావాలని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు. త్వరలోనే రాష్ట్రస్థాయిలో ఒక ఈవెంట్ మేనేజ్ మెంట్ సమావేశం నిర్వహించి తద్వారా పలు ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ల సలహాలు, సూచనలు స్వీకరించి ముందుకు వెళ్తామన్నారు. ప్రజల్లో పెరుగుతున్న పర్యాటక ఆసక్తిని, ఇంట్లో జరిగే శుభకార్యాలు మొదలుకొని సినిమా ఫంక్షన్ల వరకు చేస్తున్న ఈవెంట్లను, ఈవెంట్ మేనేజ్ మెంట్ కు పెరిగిన ఆదరణ, ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకొని పర్యాటకాభివృద్ధిలో భాగస్వామ్యులను చేసేందుకు కృషి చేస్తానని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో రాష్ట్రంలో టూరిజంకు ఆదరణ పెరుగుతోందని మంత్రి దుర్గేష్ అన్నారు. గతంలో పర్యాటక రంగానికి ఇంత ప్రాధాన్యత లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. అటు శ్రీకాకుళం నుండి ఇటు అనంతపురం వరకు ఉన్న పర్యాటక ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేసేందుకు కార్యక్రమాలు ఏర్పాటు చేసుకొని స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామన్నారు. అందులో భాగంగానే ఈ మధ్య కాలంలోనే విశాఖపట్నం, విజయవాడలలో టూరిజం కాన్‌క్లేవ్‌లు నిర్వహించామన్నారు. త్వరలోనే తిరుపతిలో ఇన్వెస్టర్ కాన్‌క్లేవ్ నిర్వహిస్తామన్నారు. పీపీపీ విధానంలో పర్యాటక అభివృద్ధి చేపట్టేందుకు ప్రైవేట్ ఇన్వెస్టర్లను ఆహ్వానిస్తున్నామన్నారు. టూరిజం ప్యాకేజీల ఏర్పాటు, పర్యాటకుల కోసం యాక్టివిటీస్ తీసుకొస్తున్నామన్నారు. రాష్ట్రంలో టెంపుల్, అడ్వెంచర్, ఎకో, వెల్‌నెస్ తదితర విభిన్న టూరిజం ప్రక్రియలను అభివృద్ధి చేస్తున్నామన్నారు.ఈనేపథ్యంలో ఈవెంట్ మేనేజ్ మెంట్ ల అవసరం ఉంటుందన్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు, పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులు ఎక్కువ రోజులు ఉండేందుకు తాము చర్యలు చేపట్టామని అందులో భాగంగా ఈవెంట్ మేనేజ్‌మెంట్ లను వినియోగించుకుంటామన్నారు. రాబోయే రోజుల్లో పర్యాటకులను ఆకర్షించేందుకు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందన్న అంశంపై ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లు దృష్టిపెట్టాలన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంల నుండి ఈవెంట్ మేనేజర్స్, ఈవెంట్‌లలో పాల్గొనే కళాకారులకు సరైన అవకాశాలు కల్పించేందుకు సహకరిస్తానని మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్‌లను ప్రోత్సహించి ముందుకు తీసుకెళ్లే బాధ్యత తీసుకొని ఎలాంటి అవకాశాలు ఇవ్వాలనే అంశంపై ప్రభుత్వపరంగా దృష్టిసారిస్తామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో అద్భుతమైన ప్రతిభ కలిగిన వ్యక్తి, జనసేన క్రియాశీల కార్యకర్త చింతపల్లి బన్ని అని ఆయన్ను మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసించారు. కార్యక్రమంలో సినిమా రంగానికి సంబంధించిన నటీనటులు, కళాకారులు, కాకినాడ ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ నిర్వాహకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కూటమి సంవత్సరపాలనలో అన్ని రంగాలను అభివృద్ధి చేస్తున్నాం

మొదటిపేజి తరువాయి

మండపాక పాపారావు, మండపాక పెద్దకాపు, మండపాక శ్రీ బాబు, గట్టెం జయ బాబు, అడబాల నందీశ్వరరావు, కాపవరపు గంగాధర్, మండపాక పెద్ద, ఒంటిపల్లి బాబ్జి, అడపా దుర్గాప్రసాద్, దాట్ల సుబ్బరాజు, అడ బాల నాగ గణేశ్వరరావు, కొండేపూడి నాగరాజు అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## అన్నదాన భవన నిర్మాణానికి విరాళం



ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి అన్నదాన భవన నిర్మాణానికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన చుండి వెంకట రామ సుబ్బారావు, నాగ కళ్యాణి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.51,116లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు స్వామివారి చిత్రపటం అందించారు.

# సామాజిక సేవకు ప్రతీకగా "యంగ్ మైండ్" వసంతోత్సవం




**కాకినాడ, మేజర్ న్యూస్ :** సామాజిక సేవను ఆదర్శంగా తీసుకుని యువతలో సేవా స్ఫూర్తిని సృజించడమే ప్రధాన లక్ష్యంగా ఏర్పాటు చేసిన యంగ్ మైండ్ స్వచ్ఛంద సంస్థ తన తొలి వార్షికోత్సవ వేడుకలు వసంతోత్సవం-2025ను ఆదివారం స్థానిక వెంకటరత్నపురం గ్రామంలోని దంటు కళాక్షేత్రంలో అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించింది. ఈ వేడుకలకు ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ శ్రీ నాయుడు ముఖ్య అతిధులుగా హాజరై సందేశాత్మకంగా మాట్లాడారు. కార్యక్రమానికి హాజరైన వారు యంగ్ మైండ్ సంస్థ వ్యవస్థాపకుడు వాకాడ వెంకటరమణ (సాదారణంగా చిన్నా మాస్టారు అనే పేరుతో ప్రసిద్ధి పొందిన) వారి సేవా గాథను కొనియాడారు. విశేషంగా చెప్పుకోవాల్సిన విషయం ఏంటంటే, వాకాడ వెంకటరమణ ఒక సాధారణ ఉపాధ్యాయునిగా తన ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ, సామాజిక సేవలో అపూర్వమైన ఆదర్శాన్ని నెలకొల్పారన్నారు. నిరాహార దినోత్సవాలు, రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ, కడుపునిండా భోజనం కానివారికి ఆహార ప్యాకెట్లు, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు వంటి అనేక రంగాల్లో విస్తృత సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ యువతను చైతన్యవంతం చేస్తున్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులకు ఘన సత్కారాలు జరిగాయి. వారికి ప్రత్యేకంగా రూపొందించిన జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ అవార్డు స్వీకార సమయంలో గణనీయంగా భావోద్వేగపూరితమైన దృశ్యాలు కనిపించాయి. ఈ కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డాక్టర్ ఎం.రవి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, కాకినాడ అర్బన్, రూరల్ మరియు కరప మండల విద్యాశాఖ అధికారులు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని యంగ్ మైండ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యంగ్ మైండ్ స్వచ్ఛంద సంస్థ బహుళ విభాగాల్లో సేవా కార్యక్రమాలను అమలు చేస్తూ, "సేవే పరమోధ్యేయం" అనే నినాదాన్ని ముందుంచుకుని కొనసాగుతోంది. విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, మహిళా శక్తీకరణ, యువతాభివృద్ధి రంగాల్లో స్పష్టమైన లక్ష్యాలతో పని చేస్తోంది. ఈ సందర్భంగా "యంగ్ మైండ్" సంస్థకు తొలి వార్షికోత్సవ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ప్రజాసేవ కార్యక్రమాలు చేపట్టి సామాజిక సేవలో ప్రాముఖ్యమైన మైలురాయిగా నిలవాలని పలువురు వక్తలు అభిలాసించారు. సేవా పథంలో అచంచలంగా ముందుకు సాగుతున్న ఈ యంగ్ మైండ్ సంస్థ, రాబోయే రోజుల్లో సమాజం ఎదుగుదలకి పునాది కావాలని నగరానికి చెందిన ప్రముఖులు ఆశించారు.

# రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

**- కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కోరిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గంలో రైల్వే మౌలిక సదుపాయాల ఆధునీకరణ, అభివృద్ధి చర్యలు తీసుకో వాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన శనివారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం ఉన్న 1×25కెవి పవర్ సప్లై వ్యవస్థ ప్రస్తుత అవసరాలకు సరిపోదని, దానిని 2×25కెవి సిస్టమ్‌గా మార్చా ల్సిన అవసరం ఉందని, ద్వారా విద్యుత్ ఇంజిన్లు మరియు ఈఎంయులకు నిరవధికంగా విద్యుత్ సరఫరా జరిగి, వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. అలానే, ఇప్పటి మౌలిక వసతులు హై-స్పీడ్ ట్రైన్లకు అనువుగా లేవని, ప్రస్తుతంగా 130 కిమీ వేగంతో నడుస్తున్న రైళ్లు మరియు భవిష్యత్తులో 160 కిమీ వేగంతో నడిపే ట్రైన్లను దృష్టిలో పెట్టుకుని బ్రిడ్జులు, యార్డులు, ట్రాక్‌లు తదితర సదుపాయాలను తక్షణమే ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే నిర్మాణాలు పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న, రైల్వే ఆర్‌ఓబి, రోడ్ అండర్ పాస్ బ్రిడ్జ్ లు మీదుగా పాదచారులు, ద్విచక్ర వాహనాలు, అత్యవసర సేవల వాహనాలకు తాత్కాలిక ప్రవేశాన్ని అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. ప్రయాణికుల భద్రత, సౌలభ్యం దృష్టిలో ఉంచుకుని ఆధునీకరణ పనులు త్వరితగతిన చేపట్టాలని ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కోరారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చెస్ పోటీలు






**రాజమండ్రి, మేజర్‌న్యూస్ :** లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ప్రపంచ చెస్ డే సందర్భంగా కాల్ ఫ్యూజన్ చెస్‌అకాడమీ నందు వివిధ విద్యార్థులకు పోటీలు నిర్వహించడం జరిగినది. ఇందు 125 మంది విద్యార్థులు పోటీల్లో పాలొన్నారు. మొదటి బహుమతి ఆర్.రోషితా నాయుడుకి, రెండవ బహుమతి డి.రుత్విక్, మూడవ బహుమతి వి.లతీక కు ఇవ్వడం జరిగినది. ఇవి కాకుండా పదిమంది విద్యార్థులకు బహుమతులు ఇవ్వడం జరిగింది. ఇందులో పాల్గొన్న ప్రతి విద్యార్థికి కన్సలేషన్ బహుమతులు ఇవ్వడం జరిగినది .ఇందుకు న్యాయ నిర్ణీతలుగా కాల్ ఫ్యూజన్ చెస్ అకాడమీ డైరెక్టర్ విత్తనాల లక్ష్మీ హైమావతి మరియు విత్తనాల కుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమమునకు క్లబ్ అధ్యక్షులు లయన్ మైలవరపు కిరణ్ కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఇంటర్నేషనల్ చెస్ డే సందర్భంగాఅండర్ 15 సం జూనియర్స్‌కు పోటీలు జరిపామన్నారు. ముఖ్య అతిథిగా జిల్లా పూర్వ గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల్లో విద్యతో పాటు ఈ చెస్ నేర్చుకోవడం వలన ఒక విధమైన రిలాక్సేషన్‌తో మెదడు ఇంకా ఉత్సాహం పొందుతుందన్నారు. ప్రత్యేక అతిథిగా జోన్ చైర్‌పర్సన్ మద్దుల వి.ఎస్. శ్రీరామ గుప్తా మాట్లాడుతూ ఈ చెస్ అనేది మన ఇండియాలోనే ప్రథమంగా ఏర్పడిందని, ప్రపంచంలోనే అతి ప్రాముఖ్యత పొందిన చెస్ క్రీడాకారులు మన ఇండియాలో ఉన్నారని, మీరందరూ కూడా అభివృద్ధి లోకి రావాలని ఆకాంక్షించారు. చెస్ ద్వారా మేధోమధనం జరుగుతుందని, పిల్లలకి జ్ఞపకశక్తి పెరుగుతుందని అన్నారు. కృమశిక్షణకు, సమయపాలన వంటి మంచి విషయాలు అలవరుతుందన్నారు. క్లబ్ అడ్మిన్ గ్రంది లక్ష్మీ వసంతకుమారి, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ట్రెజరర్ కక్కిరాల బుచ్చిరాజు, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఏరియా రిప్రెసెంటేటివ్ మాధవరావు, రాఘవరావు, క్లబ్ ట్రెజరర్ లయన్ తమ్మన ఆగం ప్రీతం, క్లబ్ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ తదితర మెంబర్లు పాల్గొన్నారు. మరియు ఈ సందర్భంగా కేక్‌ను పిల్లలచే కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. లయన్స్ ఇటువంటి కార్యక్రమాలు చేయడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## నేడు వివేకానంద పార్కులో వాటర్ ప్లాంట్ ప్రారంభం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** లైన్స్ క్లబ్ కాకినాడ ఎలైట్ ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద పార్కులో రూ. 6లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ట్యాంక్ సోమవారం సాయంత్రం ప్రారంభం అవుతుందని డోనర్ చైర్పర్సన్ ఎం.ఎస్.ఆర్.వి.సత్యనారాయణ, సెక్రటరీ వడ్డాది ఆదిత్య కందాళ రవీంద్రనాథ్ వెల్లడించారు. ఈ ప్లాంట్ ద్వారా కూలింగ్, మామూలు, వేడి త్రాగునీరు మూడు రకాలుగా వస్తాయని తెలిపారు. పూర్తి ప్రకృతి సిద్ధంగా నీళ్లు ఉంటాయన్నారు. దాత దేవు నారాయణ శేషమాంబ దంపతులు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ షాన్మోహన్, కమిషనర్ భావన సంయుక్తంగా ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో డోనర్ చైర్పర్సన్ ఎం.ఎస్.ఆర్.వి.సత్యనారాయణ, లైన్స్ క్లబ్ సెక్రటరీ వడ్డాది ఆదిత్య, కందాళ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

## శాకాంబరీ దేవిగా టూటౌన్ నూకాలమ్మ అమ్మవారు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆషాఢమాసం మూడో ఆదివారం సందర్భంగా టూటౌన్ నూకాలమ్మ అమ్మవారు శాకాంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కాకినాడ పట్టణ గ్రామ దేవతగా పట్టణ ప్రజలు భావించే అమ్మవారి ఆలయాన్ని అతి సుందరంగా అలంక రించారు. ప్రజలందరూ క్షేమంగా ఉండాలని కోరుతూ ఆలయాన్ని పండ్లు, కూరగాయలతో అలంకరించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పులకించారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తలాటం సత్య, తలాటం నాని, మిత్రబృందం కార్యనిర్వహణాధికారి వుండవిల్లి వీర్రాజు చౌదరి ఆధ్వర్యంలో భక్తులకు దర్శనాలు, ప్రసాద వితరణ గావించారు.

# సజావుగా రాత పరీక్ష నిర్వహణ

**- జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఏపీపీఎస్సీ ద్వారా లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన రాత పరీక్షను సజావుగా నిర్వహించామని, మొత్తం రెండు షిఫ్ట్ ల్లో 759 మంది అభ్యర్థులకు పరీక్ష నిర్వహించగా, 414 మంది హాజరై, 345 మంది గైర్హాజరయ్యారనీ జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు పేర్కొన్నారు. ఆదివారం రాజమహేంద్ర వరం, లూథర్ గిరిలోని ఐ-డిజ్ (ఐ-ఆన్ డిజిటల్ జోన్) పరీక్షా కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ స్వయంగా సందర్శించి పరీక్షా ప్రక్రియను పరిశీలించారు. ఉదయం 9:00 నుంచి 12:00 గంటల వరకు జరిగిన మొదటి షిఫ్ట్‌కు 519 మంది అభ్యర్థులు నమోదు కాగా, 337 మంది హాజరై, 183 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2:00 నుంచి 5:00 గంటల వరకు జరిగిన రెండో షిఫ్ట్‌కు 240 మంది అభ్యర్థుల్లో 77 మంది హాజరై, 164 మంది గైర్హాజరయ్యారన్నారు. ఈపరిశీలనలో ఏపీపీఎస్సీ అధికారి ఎం. జగదీష్, సహాయ చీఫ్ సూపర్వైజర్ ఎస్.వి. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజమహేంద్రవరంలో హలో సలోన్ అకాడమీ





**రాజమండ్రి (రాజమహేంద్రవరం)లో హలో సలోన్ అకాడమీ....**
**- గ్రాండ్ న్యూ సెలూన్‌ను ప్రారంభించిన హలో సలోన్ అకాడమీ...**
**- ముఖ్యఅతిథిగా హాజరైన కమిటీ కుర్రోళ్లు ఫేం నటి తేజస్వి రావు...**

**రాజమండ్రి, 20 జూలై, 2025:** అందం, సౌందర్యం, వస్త్రధారణలో అత్యంత ప్రజాదరణను సొంతం చేసుకున్న హలో సలోన్ & అకాడమీ నేడు రాజమండ్రిలో తన కొత్త సెలూన్‌ను ఘనంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమిటీ కుర్రోళ్లు చిత్రంలో తన నటనతో ప్రశంసలు పొందిన ప్రముఖ నటి తేజస్వి రావు హాజరయ్యారు. ఈవేడుకలో హలో సలోన్ & అకాడమీ వ్యవస్థాపకురాలు ఈతకోట శ్రావణి పాల్గొన్నారు.

హలో యునిసెక్స్ సలోన్ అండ్ అకాడమీ.., ప్రీమియం బ్యూటీ సేవలను అందించడానికి రూపొందించబడిన సరికొత్త సెలూన్. ఇది స్త్రీ పురుషులు ఇద్దరికీ నిపుణులతో జుట్టు, చర్మం, వస్త్రధారణలో సౌందర్య సేవలను అందిస్తుంది. అంతేకాకుండా బ్యూటీ వెల్నెస్‌లో ప్రొఫెషనల్ శిక్షణా కోర్సులను సైతం అందిస్తుంది. ఘనంగా నిర్వహించిన ప్రారంభోత్సవంలో సౌందర్య ప్రియులు, క్లయింట్లతో పాతంస్థానిక ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నటి తేజస్వి రావు మాట్లాడుతూ.., " హలో సలోన్ & అకాడమీ వ్యవస్థాపకురాలు శ్రావణి నాకు ప్రియమైన స్నేహితురాలు. తాను అందిస్తున్న ఈ అధునాతన సేవల్లో నిపుణురాలు. ఆమె ఇప్పుడు ప్రారంభించిన కొత్త సెలూన్ తన అభిరుచి, కృషి, సౌందర్య సేవలకు ప్రతిబింబంగా నిలుస్తున్నా. హలో సలోన్ %ు% అకాడమీలోని బృందం ఇంతకుముందు ఎక్కడ చూడని ప్రత్యేకమైన, వినూత్న నైపుణ్యాలను కలిగి ఉంది. హలో బ్యూటీ టీం... ఈ రంగంలో ప్రసిద్ధి చెందాలని, క్లయింట్లు ఈ సేవలను వినియోగించుకోవాలని" తెలిపారు.

హలో సలోన్ &అకాడమీ వ్యవస్థాపకురాలు శ్రీమతి ఈతకోట శ్రావణి... 5 సంవత్సరాలు ఫ్రీలాన్స్ మేకప్ ఆర్టిస్ట్‌గా పనిచేసి, బీ యు మేకప్ ఆర్టిస్ట్రీ అనే బ్రాండ్‌ను నిర్మించి, ప్రస్తుతం 2025లో హలో యునిసెక్స్ సలోన్ &అకాడమీగా అప్‌గ్రేడ్ చేసి ఈ రంగంలో రాణిస్తున్నారు. ఈ సందర్భంగా తన ప్రయాణం గురించి ఆమె మాట్లాడుతూ.., "రాజమండ్రి అనేది అధునాతన జీవనశైలి, ఆధునిక ఆకాంక్షలతో సంప్రదాయాన్ని అందంగా మిళితం చేసే నగరం. ఈ ఉత్సాహభరితమైన నగరానికి మా సిగ్నేచర్ స్టైల్, సేవలతో పాటు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అకాడమీ శిక్షణను తీసుకురావడం సంతోషంగా ఉంది. సోషల్ మీడియా నేడు చాలా శక్తివంతమైన వేదిక. అత్యంత స్నేహపూర్వకంగా, ప్రొఫెషనల్‌గా ఉన్న మా స్టైలిస్టులు చేస్తున్న అద్భుతమైన పనిని మీరు స్వయంగా వీక్షించవచ్చు, పరీక్షించవచ్చు. మా ఈ అద్భుతమైన సౌందర్య ప్రయాణంలో మా క్లయింట్లు మాకు చాలా విలువైనవారు. హలోలో ప్రతి క్లయింట్ ఈ తరానికి అనువైన అధిక-నాణ్యత సేవను పొందుతారని, ఈ సేవలు వారికి సంతృప్తిని ఇస్తాయని హామీ ఇవ్వగలము. ఫ్యాషన్ ఔత్సాహికులందరికీ, సౌందర్య ప్రియులకు నచ్చే ఏకైక సెలూన్ గా మా వేదిక నిలుస్తుంది" అని పేర్కొన్నారు. హలో సలోన్ &అకాడమీ ఈ ప్రారంభంతో మరింత ఔత్సాహిక బ్యూటీ నిపుణులను స్కిల్ ఎక్స్పర్ట్స్‌గా మార్చడమే లక్ష్యంగా పెట్టుకుంది. అదే సమయంలో క్లయింట్‌లకు విలాసవంతమైన, అనువైన స్థలంలో అత్యాధునిక సెలూన్ సేవలను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. సర్టిఫైడ్ అకాడమీ ప్రోగ్రామ్‌ల ద్వారా ఔత్సాహిక బ్యూటీషియన్లకు సాధికారత కల్పిస్తూనే అధిక-నాణ్యత సెలూన్ సేవలను అందిస్తూ ఈ రెండు అద్భుత పనులతో తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ఆధునిక, సురక్షితమైన సెటప్ తో పాటుగా ప్రతీ క్లైంట్ వ్యక్తిగత సంప్రదింపులతో ట్రెండ్-ఫార్వర్డ్ సేవను అందిస్తామని నిర్ధారిస్తుంది. స్టైల్- స్కిల్ ప్రత్యేకమైన సమ్మేళనం దీనిని ఫ్యాషన్ ఔస్థాయికులకు చేరువ చేస్తుంది.

హలో సలోన్ & అకాడమీ గురించి: హలో యునిసెక్స్ సలోన్ & అకాడమీ రాజమండ్రి ప్రేక్షకులకు సాంప్రదాయ బ్రైడల్ స్టైలింగ్ ను తెలుగు భాషలోనే సంప్రదిస్తూ.. స్థానిక ప్రాధాన్యతలకు అనుగుణంగా బ్యూటీ , వస్త్రధారణ సేవలను అందిస్తోంది. ఇది ప్రాంతీయ సౌందర్య పద్ధతులు, క్లయింట్ ఎంపికలను అర్థం చేసుకునే స్థానికంగా శిక్షణ పొందిన నిపుణులను నియమిస్తుంది.

అకాడమీ స్థానిక యువతకు కాస్మోటాలజీ, హెయిర్‌స్టైలింగ్‌లో నైపుణ్యం-ఆధారిత శిక్షణతో పాటు అధికారిక ధృవపత్రాలను అందించడం ద్వారా సాధికారతను అందిస్తుంది, వారికి కెరీర్ అవకాశాలను సృష్టిస్తుంది.

# తలసేమియా రన్‌లో పాల్గొన్న గౌరీనాయుడు




**- ప్రత్యేకంగా అభినందించిన నారా భువనేశ్వరి, కరణం మల్లీశ్వరి**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మెరుగైన వైద్య సేవలను అందించడం కోసం శనివారం సాయంత్రం నిర్వహించిన తలసేమియా రన్ మెగా ఈవెంట్ కార్యక్రమంలో పిఠాపురం యువ సాహితీవేత్త, రచయిత రాచకొండ నరసింహ సాహితీ సంస్థ వైస్ ప్రెసిడెంట్, ఏపీ స్టేట్ గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ లీడర్, పిఠాపురం మహారాజ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, గ్రంథాలయ సేవా సంస్థ కన్వీనర్ డాక్టర్ కిలారి గౌరీ నాయుడు ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉండే తలసేమియా బాధితులకు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా రక్తం అందించడం, ఈ వ్యాధిపై ప్రజల్లో చైతన్యం కలిగించిన లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని గౌరీ నాయుడు తెలిపారు. విశాఖ ఆర్కే బీచ్ లో నిర్వహించిన 3కె రన్ విద్యార్థి సమూహానికి టీం లీడర్‌గా వ్యవహరించినట్లు గౌరీ నాయుడు తెలిపారు. సాహితీ సంస్థల ప్రతినిధులు, ప్రజాసంఘాల నేతలు, కళాశాల విద్యార్థులతో కలిసి తలసేమియా వ్యాధిపై ప్రజలలో అవగాహన కల్పించడంలో గౌరీ నాయుడు కీలకపాత్ర పోషించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, సీఎం సతీమణి నారా భువనేశ్వరి మహిళా సాధికారతకు పేద విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దడం లాంటి గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని గౌరీనాయుడు కొనియాడారు. శనివారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ సీఎం సతీమణి నారా భువనేశ్వరి, ఢిల్లీ క్రీడా విశ్వవిద్యాలయం ఉపకులపతి, ప్రముఖ క్రీడాకారిణి కరణం మల్లేశ్వరి, హోంమంత్రి వంగలపూడి అనిత, ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈఓ రాజేంద్ర కుమార్, విశాఖ మున్సిపల్ రూరల్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తదితరులు గౌరీ నాయుడుని ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసించారు.

# యువకుడి ఆచూకీ కోసం గాలింపు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వాడపల్లి వద్ద శనివారం తెల్లవారుజామున గోదావరి నదిలో స్నానానికి వెళ్లి గల్లంతైన పామర్తి దినేష్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన దినేష్ వాడపల్లి రేవులో స్నానానికి దిగి గల్లంతయిన విషయం విధితమే. దింతో పోలీస్ అగ్నిమాపక సిబ్బంది ఎస్‌డిఆర్‌ఎఫ్ బలగాలు స్పెషల్ టీములుగా ఏర్పడి పడవలపై గాలింపు చర్యలు చేస్తున్నారు. రావులపాలెం సిఐ సిహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో మూడు బృందాలుగా ఏర్పడి గౌతమి గోదావరిలో వాడపల్లి నుంచి గోదావరి దిగు భాగాన గాలింపు చేస్తున్నారు. గల్లంతైన దినేష్ ఆచూకీ లభిస్తే కోనసీమ జిల్లాలో ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట, అయినవిల్లి, పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలని కోరారు. యువకుడి ఆచూకీ తెలిసినవారు ఆత్రేయపురం ఎస్ఐ ఎస్.రాము 944090483, రావులపాలెం సిఐ సిహెచ్ విద్యాసాగర్ 9440796527కు సమాచారం అందించాలని కోరారు.

# ఆంధ్రప్రదేశ్ ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా డా॥ నల్లమిల్లి సుగుణ






**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా కాకినాడ పట్టణమునందుగల ఆదిత్య మహిళల కళాశాల సెమినార్ హాలు నందు ఆదివారం ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నూతన కార్యవర్గ అధ్యక్షురాలుగా డాక్టర్ నల్లమిల్లి సుగుణ (తూర్పుగోదావరి), ప్రధాన కార్యదర్శిగా గుణ్ణం కృష్ణమోహన్ (పశ్చిమగోదావరి), కోశాధికారిగా ఆకుల చంద్ర కళావతి (కడప), ఉపాధ్యక్షురాలుగా కె.సూర్యలక్ష్మి దేవి (గుంటూరు), సహాయ కార్యదర్శిగా జి. నవీన్ (ప్రకాశం), కార్యవర్గ సభ్యులుగా నంద్యాల రాధిక (కర్నూల్), డి.అశోక్ బాబు (గుంటూరు) లు ఎన్నిక అయినారు. ఈ ఎన్నికలకు ఫెన్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎఐ) నుండి పరిశీలకులుగా అశోక్ దుదారె, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సాప్) నుండి వి.సతీష్ (సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ కోచ్) డిఎస్‌ఏ కాకినాడ వారు పరిశీలకులుగా విచ్చేశారు. నూతన కార్యవర్గ సభ్యులు 2025 నుండి 2029 వరకు కొనసాగుతారు అని ఫెన్సింగ్ అసోసియేషన్ మెంటార్ నాగం సతీష్ బాబు తెలియచేశారు. ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ మరియు ఆదిత్య యూనివర్శిటీ ఛాన్సలర్ డా॥ నల్లమిల్లి శేషారెడ్డి ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల డైరక్టర్ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

# ఐటిడిఏ ముట్టడి విజయవంతం చేయాలి




**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** గిరిజన మహిళ పార్వతి మృతికి కారణమైన వారిని శిక్షించాలని, ఏజెన్సీ ప్రాం తంలో డాక్టర్ల నిర్లక్ష్య వైఖరిపై నిరసన తెలిపేందుకు సోమవారం చేపట్టిన రంపచోడవరం ఐటిడిఏ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ ఉపాధ్యక్షురాలు బొరగ ఎర్రమ్మ పిలుపునిచ్చారు. వై.రామవరం మండలం జాజిగడ్డ గ్రామానికి చెందిన ఆదివాసి మహిళ కాకూరి పార్వతి వైద్యుల నిర్లక్ష్యం వలన మృతి చెందినందున సోమవారం నాడు రంపచోడవరం ఐటిడిఏ ముట్టడి కార్యక్రమం ఆదివాసి సంఘాలు ఆదివాసీ ప్రజానీకం విజయవంతం చేయాలని రంపచోడవరం డివిజన్ ఉపాధ్యక్షురాలు బొరగ ఎర్రమ్మ కోరారు. రంపచోడవరం ఏరియా హాస్పిటల్‌లో వైద్యుల నిర్లక్ష్యం వలన కాకూరి పార్వతి అనే ఆదివాసి మహిళ మృతి చెందడం జరిగిందని అందుకు నిరసనగా రంపచోడవరం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమం తలపెట్టామని అన్నారు. కాకూరి పార్వతి మృతికి కారకులైన డాక్టర్లను శిక్షించాలని ఆమె అన్నారు.

# మంత్రి సుభాష్ చొరవతో పాతికేళ్ల సమస్యకు మోక్షం

- 25 ఏళ్ళకు పైగా ఉన్న కుల ధ్రువీకరణ సమస్య పరిష్కారం
- హమ్మయ్య మా కులం ఏంటో ఇన్నాళ్లకు తెలిసింది అంటూ ఆనందం వ్యక్తం చేసిన బాధితులు
- మంత్రి సుభాష్ చేతుల మీదుగా కుల ధ్రువీకరణ పత్రాలు అందజేత



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** ఇదొక విచిత్రమైన సంఘటన.. ఒక వర్గానికి చెందిన చాలా కుటుంబాలు తాము ఏ కులానికి చెందినవారమో చెప్పుకునే పరిస్థితి లేని దుస్థితి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందలేని నిస్సహాయ స్థితి. ఇది ఎక్కడో మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో అనుకుంటే పొరపాటు. రామచంద్రపురం నియోజవర్గంలోని ద్రాక్షారామ గ్రామపంచాయతీ పరిధిలోని మండాలమ్మ పేట కొత్త కాలనీకి చెందిన మందుల కులమునకు చెందిన వీరు అనేక సంవత్సరాలుగా ద్రాక్షారామ గ్రామంలో నివసిస్తున్నారు. వీరి ప్రధాన వృత్తి ఆయుర్వేద మందులను తయారు చేసే అమ్ముకోవడం అందువల్ల వీరిని మందులోళ్ళు అని పిలిచేవారు. ప్రస్తుత కాలంలో వీరు ఉపాధి నిమిత్తం తల వెంట్రుకలు కొనడం, టీవీ కవర్లు అమ్మడం వంటి చిన్న చిన్న తదితర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి అనేక సంవత్సరాలుగా కుల ధ్రువీకరణ పత్రాలు లేవు. వీరికి చదువు లేకపోవడం, కుల ధృవీకరణ పత్రాలు సంబంధించిన సరైన అవగాహన లేక వీరు కొంతమంది రాజకీయ నాయకులు, మధ్యవర్తులు మాటలు నమ్మి తమకు ఎస్టీ సర్టిఫికెట్లు వస్తాయని చెప్పటంతో ఆ మాటలు నమ్మి ఆ విధమైన కుల ధ్రువీకరణ పత్రములు లేకుండానే ఇన్నాళ్లు బ్రతికేశారు. ఈ సమస్యను ద్రాక్షారామం సర్పంచి కొత్తపల్లి అరుణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకువచ్చారు. విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న మంత్రి సుభాష్ రామచంద్రపురం ఆర్డిఓ, రెవిన్యూ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఏ కుల ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో వీరంతా ప్రభుత్వ పథకాల కోసం ఆశతో అర్జీలు పెట్టుకొనేవారు..కానీ ఎలాంటి ప్రయోజనం లేక ఇబ్బందులు పడుతున్నారని గమనించిన మంత్రి సుభాష్ తక్షణ చర్యలు గైకొన్నారు. వీరంతా కేంద్ర ప్రభుత్వ గెజిట్ ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్ ఏ లో, సీరియల్ నెంబర్ 36లో ప్రకటించిన దాని ప్రకారం మందుల బిసి-ఎ 38 (155) చెందినవారని గెజిట్ ప్రకారం గుర్తించి వీరందరికీ బిసి-ఎ కుల ధ్రువీకరణ పత్రము జారీ చేశారు. ఆదివారం కుల ధ్రువీకరణ పత్రాలు పొందినవారంతా కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి ఆయన చేతుల మీదుగా కుల ధ్రువీకరణ పత్రాలు అందుకున్నారు. తమకు కుల ధ్రువీకరణ పత్రాలు అందడంతో తమ పిల్లల చదువులు, వృద్ధులకు వృద్ధాప్య పింఛన్లు, అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులం అయ్యామంటూ మంత్రి సుభాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్యను చెప్పిన వెంటనే తక్షణం పరిష్కారం చేసిన మంత్రి సుభాష్‌కు, ఆర్డీవోకు, తహసిల్దార్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణరామారావుకు ఆనందభాష్పాలతో కృతజ్ఞతలు తెలిపారు.

## సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహించిన ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు




**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో స్వచ్ఛత కార్యక్రమాలలో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రతి ఆదివారం నిర్వహించే సేవా కార్యక్రమాలలో భాగంగా 60 మంది వాలంటీర్లు ప్లాస్టిక్ వ్యర్థాల వాడకాన్ని తగ్గించండి పరిసరాలను పరిరక్షించండి అంటూ పరిసర ప్రాంతాల ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ కమ్యూనిటీ సర్వీస్ కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని, ప్రతి ఆదివారం సేవకు కొంత సమయాన్ని కేటాయించడం అభినందించే విషయమని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించాలని అన్నారు. ఈ విషయమై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలని అన్నారు. స్వచ్ఛభారత్ నిర్మాణం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహి ంచిన ఎన్ ఎస్ ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇంచార్జ్ మూర్తి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు టి తేజేశ్వరరావు, డి అశ్విని , సీనియర్ వాలంటీర్ శ్రీ కళ్యాణ్,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# పెరవలి ఆర్యవైశ్య సేవా సంఘం వారిచే జ్యూట్ బ్యాగులు పంపిణీ

-ప్లాస్టిక్ కవర్లు వాడకండి - చేతి సంచి వాడండి అనే నినాదంతో ర్యాలీ




**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి గ్రామ పంచాయతీ పరిధిలో జూలై 19వ తేదీ శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ఆక్టివిటీలో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపైన అవగాహనా మరియు ఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కవర్లు వాడకండి - చేతి సంచి వాడండి అనే నినాదంతో ప్రతి ఇంటికి జ్యూట్ బ్యాగ్‌లు పంపిణీ చేయడం జరిగినది.ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం కోసం పెరవలి ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు గుడివాడ బాలకృష్ణ చేతుల మీదుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఫోటోలతో కూడిన సంచులను గ్రామ ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా గుడివాడ బాలకృష్ణ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మనందరం కూడా స్వచ్ఛమైన గాలిని పీల్చాలన్న స్వచ్ఛమైన వాతావరణంలో మన పిల్లలు పెరగాలన్న మీరు ఆలోచించాల్సింది పరిసరాల పరిశుభ్రత గురించి ప్లాస్టిక్ భూతాన్ని తరమడం ఎలా అని ఆలోచించాలి అన్నారు. మీ పిల్లలు ఆరోగ్యం గా పెరగటం అనేది చాలా ముఖ్యం అన్నారు. ఇవాళ మీరు మీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోగలిగితేనే మీ పిల్లలు ఆరోగ్యం పెరుగుతారు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంగోలు సీతమ్మ జోసఫ్ కార్యదర్శి అడపా లక్ష్మీనారాయణ గ్రామ పెద్దలు బట్నం రవిబాబు, బొడ్డు రామాంజనేయులు, సలాది కృష్ణమూర్తి, సలాది శ్రీహరి, గుడివాడ ప్రసాద్, మాణిక్ రెడ్డి కూటమి నాయకులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అలంకార బ్రహ్మ

- శ్రీ శంకరమంచి విశ్వనాథ శర్మకి నంది అవార్డు



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** రితిక ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన ఉత్తమ నంది అవార్డ్స్ - 2025లో భాగంగా ధవళేశ్వరం గ్రామం అగస్త్యేశ్వర స్వామి దేవాలయ అర్చకులు బ్రహ్మశ్రీ శంకరమంచి విశ్వనాథ శర్మ (విస్సు) అలంకార సామ్రాట్ పురస్కారం జరిగింది. ఈ పురస్కారం పొందినందుకు కుటుంబసభ్యులు గ్రామ పెద్దలు, స్నేహితులు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేసారు.


## రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ మరియు కొవ్వూరు డిఎస్పి ఆదేశాల మేరకు జూలై 19వ తేదీ శనివారం నిడదవోలు సి.ఐ పి.వి.జి తిలక్ మరియు పెరవలి ఎస్సై యం.వెంకటేశ్వరరావు మరియు నేషనల్ హైవే అథారిటీ వారు పెరవలి మండలం లో హైవే పొడవున రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను పరిశీలించడం జరిగినది. అదే విధముగా రోడ్డుకు వ్యతిరేక దిశ (రాంగ్ రూటు)లో వచ్చే వాహనములను నివారించుటకు మరియు హెల్మెట్ లేని వాహన దారులపై తీసుకొను చర్యలు గురించి నివేదికను పై అధికారులకు పంపించి తగు ఉత్తర్వులు తీసుకుంటామని తెలియపరచినారు. మండలంలో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగే అన్నవరప్పాడు ఖండవల్లి మరియు నల్లాకులవారి పాలెం మరియు ముఖ్యమైన కూడలి నందు లైటింగ్ ఏర్పాటుకు టెండర్లు పిలవడం జరిగిందని నేషనల్ హైవే అథారిటీ అధికారులు తెలియజేశారు.

# రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్న కార్మిక సోదరులకు నా వందనాలు

- కోరమండల్ వర్కర్స్ కాంట్రాక్ట్ యూనియన్ ప్రెసిడెంట్ పాతాళ శ్రీనివాస్
- కోరమండల్ వర్కర్స్ లీగల్ అడ్వైజర్‌గా హైకోర్టు న్యాయవాది సలాది శ్రీనివాస్ బాబు
- ప్రెసిడెంట్ పాతాళ శ్రీనివాసును సత్కరించిన సలాది
- కార్మికులకు ఏ కష్టం వచ్చినా ముందుంటాను : న్యాయవాది సలాది



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** వలసపాకల కోరమండల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎన్నికలు ఆదివారం ఫ్యాక్టరీ ఎదురుగా శాంతియుతంగా వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ పాతాళ శ్రీనివాస్ అధ్యక్షతన అట్టహాసంగా జరిగాయి. 18 విభాగాల్లో పనిచేసే 600 మంది కార్మికులు కలిసికట్టుగా రెండవసారి పాతాళ శ్రీనివాసును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ హైకోర్టు న్యాయవాది వలసపాకల మాజీ ఉప సర్పంచ్ జనసేన సీనియర్ నాయకులు సలాది శ్రీనివాస్ బాబు మర్యాదపూర్వకంగా పాతాళ శ్రీనివాసును కలిసి పూలమాలవేసి సాలువ తో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా న్యాయవాది సలాది మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా ప్రెసిడెంట్ పాతాళ శ్రీనివాస్ రాత్రనకా పగలనకా కార్మికుల కోసం ఏ కష్టం వచ్చినా శ్రమించి వారికి ఎన్నో సేవలు అందించారని ఇలాంటి వ్యక్తిని నేను చూడలేదని గతంలో కార్మికులు రాత్రిపూట ఫ్యాక్టరీ నుండి బయటికి వెళ్ళేటప్పుడు వీధిలైట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నా దృష్టికి రావడంతో విద్యుత్ వారితో మాట్లాడి వీధిలైట్లు కూడా వేయించడం జరిగిందని గుర్తు చేశారు. అనంతరం ప్రెసిడెంట్ పాతాళ శ్రీనివాస్ మాట్లాడుతూ మీకు ఏ కష్టం వచ్చినా ఒక నాయకుడిగా కాకుండా ఒక సేవకుడిగా సైనికుడి లా పనిచేస్తానని వచ్చే రెండు సంవత్సరాలు కార్మికులకు ఫ్యాక్టరీ యజమానులతో మాట్లాడి వాళ్లకి రావలసిన ఇంటెసివ్ ఇప్పించడానికి సహకరిస్తానని అన్నారు. అలాగే లీగల్ అడ్వైజర్ గా రెండవసారి సలాది శ్రీనివాస బాబును ఉండాలని కార్మికుల తరఫున కోరగా సలది సానుకూలంగా స్పందించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం వైస్ ప్రెసిడెంట్ సి.హెచ్.రాజు, జనరల్ సెక్రెటరీ వల్లు దుర్గాప్రసాద్, సెక్రటరీ సిహెచ్ వి రమణ, ట్రెజరర్ కే.లక్ష్మణరావు, ప్రాపకాండ సెక్రటరీగా పి.రాజు లను కార్మికులు పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు ఏసుబాబు, భద్ర రావు పాల్గొన్నారు.

# అధికారుల అనాలోచిత నిర్ణయాలే ప్రజలకు శాపాలు

**– ప్రమాదంలో నిడదవోలు నరసాపురం రహదారిపై ఉన్న కాకరపర్రు వంతెన**
**– కాలువ కట్టినప్పుడు చేయవలసిన రిపేర్లు కాలువ నిండుగా ఉన్న సమయంలో చేయటమేమిటి అని స్థానికుల ప్రశ్న**



**పెరవలి, మేజర్ న్యూస్ :** అధికారుల అనాలోచిత నిర్ణయాలే ప్రజలకు శాపాలుగా మారుతున్నాయి. వివరాలు లోకి వెళ్తే నిడదవోలు నరసాపురం రహదారి పై కాకరపర్రు వద్ద ఉన్న వంతెన వద్ద ప్రమాదకరమైన మలుపు లో గతంలో అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అది అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశంగా కూడా గుర్తించి లోగడ అధికారులు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. నర్సాపురం వెళ్లే ప్రధాన కాలువ కాకరపర్రు వద్ద రెండుగా చీలి ప్రధాన కాలువ నర్సాపురం వైపు వెళ్తే బ్రాంచ్ కాలువ ఆచంట వైపు వెళుతుంది. ఆచంట వైపు వెళ్లే కాలువ పైన రోడ్డు మలుపులో నిర్మించిన ఈ వంతెన పై నిత్యం వేలాది వాహనాలు ప్రయాణం చేస్తూ ఉంటాయి. అక్కడ వంతెన మరియు రోడ్డు పటిష్టత కోసం గతంలో వంతెనకు ఇరువైపులా కాలువ గట్లకు బండరాళ్లుతో రివిట్మెంటు నిర్మించారు. ప్రస్తుతం ఖరీఫ్ పంట సీజన్ మొదలు కావడం గోదావరికి ఉధృతంగా వరదరావడంతో నరసాపురం వెళ్లే ప్రధాన కాలువ ఎర్ర నీటితో నిండుగా ప్రవహిస్తుంది. అయితే జూలై 20వ తేదీ ఆదివారం ఇరిగేషన్ అధికారులు ఆచంట వెళ్లే ప్రధాన కాలువ గట్లను ప్రమాదకరమైన వంతెన మొదట్లో జెసిబి సాయంతో తవ్వుతున్న దృశ్యాన్ని చూసిన మేజర్ న్యూస్ వారిని అడుగగా ఇరిగేషన్ అధికారులు ఆదేశాల మేరకు చేస్తున్నామన్నారు దీనిపై పెరవలి మండల ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ మురళిను వివరణ అడగగా పై అధికారుల ఆదేశాల మేరకు ఈ పని చేయిస్తున్నానని ఆయన మేజర్ న్యూస్ కు తెలియజేశారు. దీంతో మేజర్ న్యూస్ ప్రతినిధి ఈ ప్రమాదకరమైన వంతెన ప్రక్కన కాలువగట్లకు బండ రాళ్లుతో లోగడ రివిట్మెంట్లు నిర్మించారని నీటిలో ఇప్పుడు గట్లను తవ్వితే వంతెన పునాదులకే ప్రమాదంగా మారి వేలాది వాహనాలు ప్రయాణించే వంతెన మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని ఇరిగేషన్ డిఇ వెంకటనారాయణ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై డిఈ వెంకట నారాయణ వివరణ ఇస్తూ ఆచంట ప్రధాన కాలువ శివారు గ్రామాల వారికి సాగునీరు అందడం లేదని అక్కడ రైతుల ఆందోళన మేరకు అధికారులు అందరం పరిశీలించి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలియజేశారు.

ఇదే రిపేర్లు కాలువ కట్టేసినప్పుడు చేసుకోవచ్చు కదా అని మేజర్ న్యూస్ ప్రతినిధి అడుగగా అప్పుడు రిపేర్లకు నిధులు లేవని ఆయన బదులిచ్చారు దీనిపై మేజర్ న్యూస్ ప్రతినిధి ఇప్పుడు రిపేర్లకు నిధులు మంజూరు అయ్యాయా అని ప్రశ్నించగా మంజూరు అవ్వలేదని సాగునీటి సంఘాల ప్రతినిధుల చొరవతో ఈ రిపేరు చేస్తున్నమన్నారు. ఈ విషయం పరిశీలించిన వాహన దారులు, స్థానికులు మాట్లాడుతూ "రాజుల సొమ్ము రాళ్లపాలు– ప్రజల సొమ్ము గంగపాలు" అన్న సామెత దీనికి వర్తిస్తుందని కాలువలు కట్టేసిన సమయంలో ఇటువంటి మరమ్మత్తులు చేసుకోవాలని నిండుగా ప్రవహిస్తున్న ప్రస్తుత తరుణంలో ఇటువంటి రిపేర్లు ప్రమాదకరమని వాపోయారు.

# మరిడమ్మ దేవస్థానం వద్ద పూర్వ విద్యార్థులు పులిహోర పంపిణి




**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో మహారాణి డిగ్రీ కాలేజ్‌కి చెందిన 1988–91 బికాం.బి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో, శ్రీ మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని, ఆదివారం శ్రీ మరిడమ్మ అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు పులిహోర ప్రసాదం , వాటర్, చిన్నపిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం పూర్వ విద్యార్థుల సామూహిక ఆధ్యాత్మిక బాధ్యతగా భావించి, అమ్మవారి జాతరలో భాగస్వామ్యం కావడం పట్ల ఎంతో ఆనందంగా ఉన్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు.. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాబోలు సత్య ప్రసాద్, పైడా రామకృష్ణ, ఆర్వీ సత్యనారాయణ, ప్రతాప్ సింహా, కశిరెడ్డి శ్రీను, చి. వెంకటేశ్వరరావు, డీవీడీ సత్యనారాయణ, జగ్గారావు, వి.అప్పారావు, వసంతరావు, కర్రి వరలక్ష్మి, కె. సత్యనారాయణ, ఉమా మహేశ్, కామరాజు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు ప్రజా ప్రతినిధులకు తెలియనివ్వరా..?
# ప్రజా ప్రతినిధులు ఆవేదన



రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ : మండలంలో జరుగుతున్న ఎం జి ఎన్ ఆర్ఈజి ఎస్ పనులు ప్రజా ప్రతినిధులకు చెప్పకుండా చేస్తున్నారని ఉపాధి హామీలో ఏం జరుగుతుందో తెలియడం లేదని ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన ఎంపీడీవో యాదగిరేశ్వరరావు ఆధ్వర్యంలో మండల పరిషత్ సమావేశపు హాలు నందు జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో జడ్పిటిసి, ఎంపీటీసీలు, సర్పంచ్ లు ప్రజా సమస్యలు పట్ల అధికారులను ప్రశ్నించారు. వారంలో రెండు రోజులు సోమవారం, శనివారం పని చేస్తే మిగిలిన రోజులు మస్టర్లు వేస్తున్నారని జడ్పిటిసి జ్యోతి ఆరోపించారు. కొందరు ఉపాధి సిబ్బంది తప్పి దాలు వల్ల టెక్నికల్ అసిస్టెంట్లు బలై పోతున్నారని ఎంపిటిసి పెద్దిరాజు అన్నారు. అలానే ఉపాధి హామీలో అవకత ఒకలు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోకుండా మేట్లను టెర్మినెట్ చేయడం విచారకరమని ప్రజా ప్రతినిధులు అన్నారు. గ్రామంలో త్రాగునీటి బోర్లు మన్మత్తులు ఎంపీడీవో పరిధిలో కాకుండా సర్పంచులు ఆధ్వర్యంలో బోర్లు రిపేరు చేయించేలా డీ ఎల్ పి ఓ కు తెలియజేయాలని ప్రజా ప్రతినిధులు కోరారు. జడ్డంగి, తంటికొండ పంచాయతీలో జాతీయ రహదారిలో కోల్పోయిన త్రాగునీటి బోర్లకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని సర్పంచ్ లు కొంగర మురళీకృష్ణ, ఆగూరి సుబ్బలక్ష్మి కోరారు. గ్రామాల్లో స్మశాన స్థలాలు కావాలి స్తే ప్రభుత్వం స్థలాలు ఏర్పాటు చేస్తుందని తాసిల్దార్ సత్యనారాయణ తెలిపారు. నాడు నేడు పనుల్లో పాఠశాలలు అసం పూర్తిగా నిలిచిపోయాయని ప్రజా ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జడ్పిడిసి వడుగుల జ్యోతి, మార్కెట్ కమిటీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, వైస్ ఎంపీపీలు సత్య చంద్ర రాణి, రాజేశ్వరి, కనిగిరి గంగా దుర్గ,సుంద్రు లోవ లక్ష్మి, సత్తిబాబు, స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణి, సవరాల చంద్రుడు, కోండ్లు సూరిబాబు, జగన్నాథం, గని లక్ష్మి, సత్యవతి, అధికారులు ఉన్నారు.

## రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష జన్మదిన సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ



**కూనవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీష భాస్కర్ జన్మదిన వేడుకలను కూనవరం మండలంలో క్లస్టర్ ఇంచార్జి కొక్కిరేణి ఆదినారాయణ మాజీ మండల ప్రధాన కార్యదర్శి గడ్డిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ హాస్పిటల్ లో ఉన్న రోగులకు పాలు పండ్లు బ్రెడ్ బిస్కెట్లు పంపిణీ చెయ్యడం జరిగింది. ఎమ్మెల్యే మిరియాల శిరీష ఈ సంవత్సర కాలంలో నియోజకవర్గం ను అభివృద్ధి పరంగా సంక్షేమ పరంగా సామజిక సేవ పరంగా ముందుండి నడిపిస్తున్నారు. గోదావరి వరదల సమయంలో విలీన మండలాల్లో ప్రజలకు ఇప్పటి వరకు ఏ ఎమ్మెల్యే చెయ్యలేనటువంటి సేవ చేశారు. ఆపద అంటూ వారి వద్దకు వెళితే మేమున్నాం అంటూ ఎమ్మెల్యే మిరియాల శిరీష మరం విజయ్ భాస్కర్ ఆదరించి ఆర్థికంగా సమయం చేసి పేద ప్రజలకు అండగా ఉంటూ భరోసా కల్పిస్తున్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు గురించి ప్యాకేజ్ గురించి అసెంబ్లీ లో మాట్లాడిన మొట్టమొదటి ఎమ్మెల్యే మిరియాల శిరీష భాస్కర్ ఇలా మరెన్నో మంచి పనులు చేస్తూ రంపచోడవరం నియోజకవర్గంలో మరిన్ని సంవత్సరాలు ఎమ్మెల్యేగా గెలుపొందాలని వారి సేవలను మరింత ఎక్కువ మందికి చెయ్యాలని మనస్ఫూర్తిగా దేవుడిని కోరుకుంటున్నాము ఈ కార్యక్రమంలో కూనవరం మండల టీడీపీ క్లస్టర్ ఇన్చార్జి కొక్కిరేణి ఆదినారాయణ కూనవరం మండలం మాజీ మండల ప్రధాన కార్యదర్శి గడ్డిపాటి ప్రసాద్ కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ హాస్పిటల్ డైరెక్టర్ చదలవాడ శివక్రిష్ణ కో ఆప్షన్ సభ్యులు షేక్ షరీఫ్ అరకు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్ సీనియర్ నాయకులు నోముల సత్యనారాయణ కర్నాటి శ్రీనివాస్ శావిలి రాజేశ్ యడ్ల రాంబాబు కాచవరం గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి బొల్లి హరీష్ కాచవరం బూత్ ఇంచార్జి దగ్గుబెల్లి వినోద్ యూనిట్ ఇంచార్జి చింతం సాయి కిరణ్ యువత నాయకులు సాని రాజా రవీంద్ర బొల్లి వంశీ టేకుబాక బూత్ ఇంచార్జి వెల్లంకి వెంకన్న యూనిట్ ఇంచార్జి మడకం చిన్ని తెల్లం సురేష్ తొండ శ్రీను నస్కూరి రవి నస్కూరి సతీష్ నాగు కొవ్వాల నాగరాజు హాస్పిటల్ సూపరిండెంట్ మహేష్ కుమార్ డాక్టర్ తేజ తదితరులు పాల్గొన్నారు.

## జడ్డంగిలో సుపరి పాలనలో తొలి అడుగుకు ఎమ్మెల్యే శిరీష భాస్కర్

**– బహుళ ప్రయోజనం గోదాం ప్రారంభోత్సవం**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని జడ్డంగి గ్రామంలో సోమవారం సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్ర మానికి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష భాస్కర్ ముఖ్య తిధిగా పాల్గొని మధ్యాహ్నం 3:00 గకు డోర్ టు డోర్ పర్యటించి కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరి ంచడం జరుగుతుందనిటిడిపి సీనియర్ నాయకులు మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావుతెలిపారు. అలానే తొలితగా మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రక్కన నూతనంగా నిర్మించిన లిబహుళలి లిప్రయోజనలి సౌకర్య గోదాం(సొసైటీ వారిచే నిర్మించబడిన గోడౌన్ )ప్రారంభోత్సవం, ఫెర్టిలైజర్ అమ్మకాలు ఎమ్మెల్యే శిరీష భాస్కర్ ప్రారంభించడం జరుగుతుందన్నారు. రాజవొమ్మంగి మండలంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

# గురివింద చందంగా చంద్రబాబు ప్రభుత్వ తీరు

**- మిధున్ రెడ్డి అక్రమ అరెస్టు అప్రజాస్వామికం**
**- జమ్మలమడక నాగమణి**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** గత చంద్రబాబు ప్రభుత్వ పాలనా కాలంలో జరిగిన లిక్కర్ స్కాంలో బెయిల్ పై ఉన్న చంద్రబాబు వైసీపీ నాయకులను ఆధారాలు లేకుండా లిక్కర్ స్కామ్‌లో ఇరికించే ప్రయత్నం చేస్తున్న తీరు గులి వింద చందంగా ఉందని వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శించారు. 2015- 19 మధ్యకాలంలో చంద్రబాబు పాలనలో లిక్కర్ స్కాంలో 5200 కోట్లు కొల్లగొట్టిన విషయంలో కాగ్ చంద్రబాబును తప్పు పట్టిన విషయం కూటమి నాయకులు చంద్రబాబు గుర్తు చేసుకోవాలని ఆమె హితవు పలికారు. గత నాలుగు నెలలుగా లిక్కర్ స్కామ్‌లో జగన్‌కు సన్నిహితులుగా ఉండే నాయకులను ఆధారాలు లేకుండా ఇరికించే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తుందని, నిరాధారమైన ఆరోపణలతో అక్రమ అరెస్టులకు పాల్పడుతుందని ఆమె విమర్శించారు. జగన్ వెంట ఉన్నది ఆయనను ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించే ఒక మహా సైన్యం అని, కూటమి ప్రభుత్వం చేసే నీచ రాజకీయాలకు తలవంచే పరిస్థితిలో వైసిపి నాయకులు గానీ కార్యకర్తలు గాని లేరనే విషయాన్ని కూటమి నాయకులు గుర్తుపెట్టుకోవాలని ఆమె అన్నారు. 2015లో ప్రివిలైజ్ పన్ను రద్దుచేసి చీకటి జీవో ఇచ్చిన ఘనత చంద్రబాబుదేనని, 20 డిస్టిలరీలు ఉంటే దానిలో 14 వరకు అనుమతి ఇచ్చింది చంద్రబాబేనని ఆమె గుర్తు చేశారు. ఈ కూటమి ప్రభుత్వ పాలన మొదలైన తరువాత విచ్చలవిడిగా బెల్టు షాపులకు మద్యం దుకాణాలకు అనుమతులు ఇచ్చి రాష్ట్రంలో మహిళలపై దాడులు అత్యాచారాలు పెరగడానికి ఈ ప్రభుత్వమే కారణం అవుతుందని అనేక కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయని ఆమె వాపోయారు. జగన్ పరిపాలనలో ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వమే మద్యాన్ని ఎమ్మార్పీ ధరలకు విక్రయిస్తే నేడు కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తుల నుండి ముడుపులు తీసుకొని విచ్చలవిడిగా మద్యం దుకాణాలకు బెల్ట్ షాపులకు అనుమతులు మంజూరు చేసిందని ఆమె విమర్శించారు. వైసీపీ పాలనలో మద్యం ద్వారా ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం వచ్చేదని, ఆదాయం వచ్చే సమయంలో స్కాములకు అవకాశం ఎక్కడ ఉంటుందని, మిధున్ రెడ్డి అరెస్టు కేవలం వ్యక్తిగత కక్ష సాధింపు చర్యగా ఆమె పేర్కొన్నారు. గతంలో కూడా పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడానికి ఫారెస్ట్ ల్యాండ్ విషయంలో కూడా అభియోగాలు మోపి దానికి ఆధారాలు లేక నిరూపించలేకపోయిందని, ఈ మద్యం స్కాం విషయంలో కూడా మిధున్ రెడ్డి సచ్చీలురుగా బయటికి రావడం తథ్యమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న పచ్చ మీడియా ప్రభుత్వ పనితీరుపైన ప్రజలకు జరుగుతున్న అన్యాయంపైన ప్రజా సమస్యలపైన చర్చలు నిర్వహిస్తే ప్రజలకు రాష్ట్రానికి మేలు జరుగుతుందని, అక్రమ అభియోగాల వల్ల, రచ్చ చేసి వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం వల్ల ప్రభుత్వం పట్ల మీడియా పట్ల ప్రజలు విశ్వాసం కోల్పోతారని ఆమె అన్నారు. వైసీపీ నాయకులను గాని కార్యకర్తలను గాని నిరాధారమైన ఆరోపణలతో ఇబ్బందులు పెట్టే చర్యలు మానుకోవాలని, లేదంటే ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని ఆమె హెచ్చరించారు.

# పదవులు అలంకారం కాదు.. అది ఒక బాధ్యత

**- కూటమి ప్రభుత్వంలో కష్టపడే వారందరికీ తగిన గుర్తింపు**
**- సహకార సంఘాలు బలోపేతంతో అన్నదాతకు మేలు**
**- పెనుమళ్ళ సహకార సంఘం కమిటీ ప్రమాణ స్వీకార సభలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, చిక్కాల**



**కాజులూరు, మేజర్ న్యూస్ :** కూటమి పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందని, పదవి అలంకారం మాత్రమే కాదని అదొక పెద్ద బాధ్యత అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గారి తండ్రి, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం గారు పేర్కొన్నారు. ఆదివారం కాజులూరు మండలం పెనుమళ్ళ సహకార పరపతి సంఘంకు ఎన్నికైన నూతన పాలక కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవ (త్రీ మెన్ కమిటీ) కార్యక్రమం మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, రామచంద్రపురం నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, కూటమి నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చైర్ పర్సన్ గా కొల్లు వెంకటేశ్వరరావు, సభ్యులుగా బొక్కా అప్పన్న, కోన సుబ్రహ్మణ్యంలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఎసిఎస్)లు ద్వారా రైతాంగానికి మేలు జరుగుతుందన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా గాడి తప్పిందని, కనీసం అన్నదాతలను పలకరించే పరిస్థితి కూడా లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించి పాలన సాగిస్తున్నామన్నారు. రైతాంగానికి ప్రాముఖ్యమైన పిఎసిఎస్‌లకు పునర్జీవం తీసుకొచ్చి రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది అన్నారు. గుంతలు రహిత రోడ్లు నిర్మాణం, ఎన్నికల హామీలైన పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం తూచా తప్పకుండా అమలు చేశామన్నారు. వచ్చే నెలలో ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రవేశం, అన్నదాత సుఖీభవ హామీలు కూడా నెరవేరుస్తామన్నారు. నియోజకవర్గంలోని 31 సొసైటీల్లో పార్టీ కోసం కష్టించి పని చేసిన వారికి తగిన ప్రాధాన్యత ఇస్తూ పదవులు ఇవ్వడం జరిగిందన్నారు. కూటమి అభివృద్ధిని చూసి తట్టుకోలేని వైసిపి నాయకులు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, వాటిని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వ్యవస్థలకు పునర్జీవం తీసుకొచ్చి పూర్తిస్థాయిలో బలోపేతం చేస్తున్నామ న్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్లో వ్యవసాయ రంగానికి తగిన నిధులు కేటాయించి రైతులకు అండగా నిలిచిందన్నారు. రైతుల సంక్షేమం,వారిఆర్థిక పరిపుష్టికి సహకార సంఘాలు దోహదపడతాయన్నారు.

దేశానికి వెన్నెముక అయిన రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంద న్నారు. నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే 80 శాతం మేర హామీలను నెరవేర్చామని ,పిఎసిఎస్‌ల మెరుగైన పనితీరుతో అన్నదాతలకు పూర్తిస్థాయిలో మేలు జరుగుతుందని ఆకాంక్షించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన పెనుమళ్ళ సొసైటీ త్రీ మెన్ కమిటీ కార్యవర్గాన్ని వాసంశెట్టి సత్యం, కూటమి నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్యక్రమంలో కూటమిపార్టీ నాయకులు చింతపల్లి వీరభద్రరావు, పెంకే సాంబశివరావు, చవ్వాకుల నారాయణమూర్తి, పేపకాయల బాబ్జి, వనుం వీరబ్రహ్మం, కోట తాతబ్బాయి, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని అభినందనలు తెలియజేశారు.

# జోరుగా పేకాటలు పెడతావా పడుతున్న యువత

**రోడ్డు ఎక్కుతున్న మహిళలు -పట్టించుకోని అధికారులు**



**గండేపల్లి మేజర్ న్యూస్** జోరుగా మండలంలో పలుచోట్ల పేకాటలు జరుగుతున్నాయని పలువురు నోట వినబడుతుంది. ఆదివారం జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న మండల పరిధి నీలాద్రి రావు పేట గ్రామం కాలనీ శివారు పంట పొలాల్లో పేకాట నిర్వహిస్తు న్నారు. అది తెలుసుకున్న ఇద్దరు మహిళలు శిబిరంపై దాడి చేయగా పేకాట రాయుళ్లు పరారయ్యారు. దాంతో సత్య అనే మహిళ మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా ఈ ప్రాంతంలో పేకాట నిర్వహిస్తున్నారని కొంతమంది కుటుంబాలను కూడా పట్టించుకో కుండా పేకాట ఆడుతూ అప్పులు చేస్తూ కాలక్షేపం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన మరిది నాలుగు రోజులుగా ఈ పేకాటలో కూర్చుని సుమారు పదివేల రూపాయల వరకు అప్పులు చేయడం జరిగిందని దీనివల్ల కుటుంబం అప్పుల పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా అతనికి ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల కలిగి ఉన్నాడని, ఇటువంటి అసాంఘిక కార్యకలాపాల తో కాలక్షేపం చేస్తే పిల్లలు భవిష్యత్తు ఏమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేకాట శిబిరాలపై అధికారులు దాడులు చేయరా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించి పేకాట నిర్వహణ లు అరికట్టాలని కోరారు.

## శాకాంబరి అలంకరణతో అమ్మవారు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని ర్యాలి గ్రామంలో కొలువై ఉన్న గ్రామదేవత వాగ్దేవి నగర మహాలక్ష్మి అమ్మ వారి ఆలయంలో ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం అమ్మవారు శాకాంబరి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో శ్రీ అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యనిర్వాహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు




పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసి యున్న శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారు ఆషాఢ మాస జాతర మహోత్సవాలు సందర్భంగా దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె. విజయలక్ష్మి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం శ్రీ మరిడమ్మ అమ్మవారిని వేద పండితులు, ఆసాదులు ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అసిస్టెంట్ కమీషనర్ కె. విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎస్సై వి మౌనిక ఆధ్వర్యంలో ప్రజలకు ట్రాఫిక్ కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది ఎస్. వెంకటరమణ, క్రాంతీవీర్, వరహాలు, గౌరి, తదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే శక్తిస్వరూపిణి కోట సత్తెమ్మ ఆలయ దీర్ఘకాలిక అభివృద్ధికి శ్రీకారం





**– రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్**

**నిడదవోలు,మేజర్‌న్యూస్ :** ప్రతిష్టాత్మక అఖండ గోదావరి ప్రాజెక్టు అంతర్భాగంగా ప్రఖ్యాత కోటసత్తెమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఆషాడ మాసం చివరి ఆదివారం సందర్భంగా నిడదవోలు నియోజకవర్గం నిడదవోలు రూరల్ మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువై ఉన్న ప్రసిద్ధ అధ్యాత్మిక పుణ్యక్షేత్రం శ్రీశ్రీశ్రీ కోట సత్తెమ్మ ఆలయంలో శాకాంబరిగా దర్శనమిచ్చిన అమ్మవారిని మంత్రి కందుల దుర్గేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు,వేద పండితులు మంత్రి దుర్గేష్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆషాడ మాస ఉత్సవాల సందర్భంగా శక్తిస్వరూపిణి అయిన అమ్మవారికి మంత్రి దుర్గేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి దుర్గేష్ కు ఆలయ అధికారులు, పూజారులు అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఉత్సవాల సందర్భంగా కూరగాయలతో శోభాయమానంగా తీర్చిదిద్దిన ఆలయ ప్రాంగణం, ముఖ మండపం, గర్భగుడిని, ఆలయ పరిసర ప్రాంతాలను మంత్రి దుర్గేష్ పరిశీలించారు. భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో ఆలయాలు, పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అందులో భాగంగా కోట సత్తెమ్మ ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ శంకు చక్ర గధ అభయ హస్త యజ్ఞోప వేదధారిణిగా ఏకశిల స్వయంభు విగ్రహంతో త్రిశక్తి స్వరూపిణిగా కొలువైన కోటసత్తెమ్మ తల్లిని దర్శనం చేసుకోవడం మనసుకు తృప్తినిచ్చిందన్నారు. కొలిచిన వారికి కొంగుబంగారమై నిలిచే కోట సత్తెమ్మ అమ్మవారు నేడు శాకాంబరీ దేవి అలంకరణలో భక్తులందరికీ ఆశీర్వాదం అందిస్తుండటం శుభ సందర్భంగా అభివర్ణించారు. ఆషాడ మాసంలో శాకాంబరి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా నిడదవోలు ప్రాంత ప్రజలని, రాష్ట్ర ప్రజలకు సుభిక్షంగా ఉంచాలని, వేలాదిగా తరలివచ్చే భక్తులకు సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నానన్నారు. ఆలయ పరిసరాలను పరిశీలించిన అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ విశిష్టమైన చారిత్రక నేపథ్యం కలిగి, అద్భుతమైన ప్రాకారాలతో, ఆకట్టుకునే ముఖ ద్వారంతో, ఎత్తైన రాజగోపురంతో అలరారుతున్న కోట సత్తెమ్మ ఆలయం తూర్పుగోదావరి జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమన్నారు.భక్తుల సంఖ్య రోజురోజుకు క్రమక్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ఆలయాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈ నేపథ్యంలో అఖండ గోదావరి ప్రాజెక్టులో అంతర్భాగంగా కోటసత్తెమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా అధ్యాత్మికతను మెరుగుపరిచేందుకు ఆలయ ఆవరణం అభివృద్ధి, ఆలయ గోపురం ఆధునికీకరణ చేయడంతో పాటు భక్తుల సౌకర్యార్థం అదనపు యాత్రికుల వసతి గృహాలు తదితర అవసరమైన మౌలిక వసతులు కల్పించనున్నామన్నారు. అఖండ గోదావరి ప్రాజెక్టులో సంబంధిత అంశాలు పొందుపరిచామని త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. బయట నీటి సామర్థ్యం పెరిగితే డ్రైనేజీ వాటర్ ఆలయంలోకి వచ్చే అవకాశముందని గుర్తించి దీర్ఘకాలిక పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తూరలను శుభ్రపరిచి నీరు బయటకి వెళ్లేందుకు తాత్కాలిక ప్రాతిపదికన చర్యలు చేపడతామన్నారు.పర్యాటక శాఖ మంత్రిగా తాను కోట సత్తెమ్మ ఆలయ దీర్ఘకాలిక అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్‌తో భక్తులు ఫోటోలు దిగారు. తమ అభిమాన నేతను కలుసుకున్నామని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# నేడు “శాకాంబరిగా” దర్శనమివ్వనున్న పురుహుతికా అమ్మవారు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ఆషాడ మాసం పురస్కరించుకొని నేడు (సోమవారం) శ్రీ పురుహుతికా అమ్మవారు శాకాంబరీగా దర్శనం ఇవ్వనున్నారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేసినట్లు పాదగయా క్షేత్ర ఆలయ కార్య నిర్వహణ అధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. జీవకోటి ఆకలి తీర్చే శాకాంబరీ దేవిగా పురుహుతికా అమ్మవారు దర్శనమివ్వనున్నారని, పంట తొలిదశలో ఉన్న సమయంలో అమ్మవారిని పూజించడం వలన పంటలు సమృద్ధిగా పండుతాయని, సకల శుభాలు కలుగుతాయని, శాకాంబరీ అలంకరణలో అమ్మవారిని దర్శించి అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరుచున్నామన్నారు.

# మహిళ మెడలో గొలుసు చోరీ



**అనపర్తి, మేజర్ న్యూస్ :** అనపర్తి గ్రామంలోని ఒక మహిళ మెడలో గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. అనపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని వెంకటరత్నాపురంలో నివాసముంటున్న కర్రి ఆదిలక్ష్మి అను వృద్ధురాలు ఆదివారం ఉదయం ఇంటిలోని తుడిచిన చెత్తను పారవేసేందుకు బయటకు వెళ్ళగా ఆ సమీపంలో ఉన్న గుర్తి తెలియని వ్యక్తులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. ఆ సమయంలో ఆమె పెద్దగా కేకలు వేసినప్పటికీ అప్పటికే ఆ దుండగులు పారిపోయారని ఆమె అన్నారు. ఇందుపై ఆమె అనపర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో అనపర్తి ఎస్సై శ్రీను నాయక్ ఆమె నుండి వివరాలు తెలుసుకుని దర్యాప్తు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీను నాయక్ మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైన పురవీధుల్లో సంచరిస్తున్నట్లు తెలిస్తే మా పోలీసు వారికి సమాచారం అందించాలని అన్నారు. ప్రజలు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. దుండగులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై శ్రీను నాయక్ అన్నారు.

# నేడు పిఠాపురంలో “పీజీఆర్ఎస్” కార్యక్రమం రద్దు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** నేడు అనగా సోమవారం పిఠాపురం పాడా కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార (పీజీఆర్ఎస్) వేదిక కార్యక్రమం రద్దు చేయబడినట్లు పాడా ఏ పీడీ వసంత మాధవి పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం పిఠాపురం పాడా కార్యాలయంలో ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమం ఈ నెల 21వ తేదీన (సోమవారం) అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్లు తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

# అగ్ని ప్రమాద ఘటనలో బాధితులకు పరామర్శ

**– బాధితులకు ఆర్థిక సహాయమందించిన వంగా గీత విశ్వనాథ్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ఇటీవల పిఠాపురం పట్టణం 9 వ వార్డు ఇందిరా నగర్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో కొల్లి నాగ సూర్య సత్యనారాయణకు చెందిన తాటాకు ఇల్లు పూర్తిగా కాలిపోయి బాధిత కుటుంబం రోడ్డున పడింది. ఈ విషయం తెలుసుకొన్న పిఠాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ ఇంచార్జ్ వంగా గీతా విశ్వనాథ్ ఘటన స్థలాన్ని నాయకులతో కలిసి పరిశీలించారు. బాధితులకు ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గండేపల్లి రామారావు (బాబి), పట్టణ అధ్యక్షులు రావుల మాధవరావు, నాయకులు కొత్తేమ్ దత్తుడు, వార్డు కౌన్సిలర్ పెదపాటి నాగేశ్వరరావు, పెదపాటి రాజేష్,పాల్గొన్నారు.

# తోట నరసింహానికి, నాకు విమర్శించే హక్కు లేదు

**–ఆయన నేను పలు పార్టీలు మారాము... ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిని వంచనపరుడు అని విమర్శించడం తోట నరసింహానికి తగదని అన్నారు. ఈరోజు ప్రభుత్వం తల్లికి వందనం అందజేసిందని, ఉచిత సిలిండర్లు అందిస్తుందని, ఈ నెలలో రైతులకు అన్నదాత సుఖీభవ ఇస్తున్నామని, ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని ఇవి కనపడట్లేదా నరసింహం అని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యంగా మీ పక్క గ్రామం గెద్దనాపల్లిలో ఐదుగురికి తల్లికి వందనం, మీ ఇంటి పక్కన ఉన్నవారికి నలుగురికి తల్లికి వందనం వేయడం జరిగింది ఇవి కనపడటం లేదని నరసింహం అని ఆయన అన్నారు. ముఖ్యంగా తోట నరసింహం, నేను ఎవరిని విమర్శించే హక్కు లేదని మేము అన్ని పార్టీలు మారి వచ్చామని అన్నారు. ముఖ్యంగా తోట నరసింహం ఆరోజు పార్లమెంటు సభ్యుడిగా టిడిపి నుండి సీటు ఇచ్చినప్పుడు వంచన పరుడు చంద్రబాబు కనపడలేదా అని అన్నారు. కాంగ్రెస్‌లో ఉండి ఆఖరి నిమిషంలో తెలుగుదేశం పార్టీలో చేరి పార్లమెంటు సభ్యుడిగా, తర్వాత మళ్లీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి పెద్దాపురం, తర్వాత జగ్గంపేట నుండి పోటీ చేయడం ఈరోజు ఆయన మాట్లాడే హక్కు లేదని ఎందుచేతనంటే ఎమ్మెల్యేగా, మంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా 20 సంవత్సరాలు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో ఉంటూ ఉన్న గ్రామానికి రోడ్డు వేయించుకోలేని పరిస్థితి ఆయనదని ఎమ్మెల్యే అన్నారు. నేను పార్టీలు మారాను కానీ నియోజకవర్గ అభివృద్ధి కోసం అనేక నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని ముందుకు నడిపించాలని ఆయన పార్టీలు మారి నియోజకవర్గానికి ఏం తీసుకొచ్చారు తెలియజేయాలని లేదంటే ముఖాముఖి చర్చకు సిద్ధమా అని జ్యోతుల నెహ్రూ సవాల్ విసిరారు. మా కార్యకర్తలు దోచుకు తింటున్నారని ఆయన పత్రికా సమావేశం అంటున్నారు. మీ కార్యకర్తలు ప్రభుత్వ నిధులతోపాటు మీ సొంత నిధులు కూడా దోచుకున్నారని మీరే చెప్పుకున్నారని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, సత్తి సదాశివరెడ్డి, కుంచే తాతాజీ, బద్ది సురేష్, పాఠంశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.